సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం | 5 | మే | 2023



ఆరోగ్యవరం డైరెక్టర్‌గా రవీంద్ర

క్షయరోగుల వైద్య కేంద్రం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(శానిటోరియం-ఏఎంసీ) నూతన డైరెక్టర్‌గా డాక్టర్.కె.పి.రవీంద్ర బాధ్యతలు స్వీకరించారు. - 8లో



సూదిమందు వికటించి వృద్ధురాలి మృతి

సూదిమందు వికటించడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ విషాద సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.70	రూ.78
రెండోరకం	రూ.50	రూ.68

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 532 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	403	520
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1052.20 కిలోలు

న్యూస్‌రీల్

రేపు డీఎస్సీ 98 ఉపాధ్యాయుల సమావేశం

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఎస్సీ-98(మినిమమ్ టైమ్‌స్కేల్) ఉపాధ్యాయుల సమావేశం శనివారం ఉదయం 10గంటలకు పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో జరుగుతుందని అసోసియేషన్ నాయకులు తెలిపారు. డీఎస్సీ 98 ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... డీఎస్సీ 98 ఉపాధ్యాయుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించేందుకు, సర్వసభ్య సంఘ ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి డీఎస్సీ 98 కింద ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, నారాయణస్వామి, భాస్కర్ రెడ్డి, శేషశయన్, వి.రమేష్‌బాబు, రెడ్డిబాషా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



అరుణాచలం వెళుతున్న భక్తులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి స్థానిక వన్, టు డిపోల నుంచి గురువారం ప్రత్యేక బస్సులు వెళ్లాయి. స్థానిక వన్‌డిపోలో ఆరు బస్సులల్లో భక్తులు వెళ్లారు. డీఎం మూరే వెంకటరమణారెడ్డి పూజలు నిర్వహించి యాత్ర స్పెషల్ బస్సులను ప్రారంభించారు. టు డిపో నుంచి ఆరు బస్సులు వెళ్లినట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

రాయచోటి అర్బన్ : జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు 14, మినీ కార్యకర్తలు 13, సహాయకులు 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మొద్దు

కడప రూరల్ : నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మి మోసపోవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ ఆరోగ్య సంస్థలో డాక్టర్ పీవైపీ ఖాన్ పర్యవేక్షణలో మహిళలకు డేటా సూపర్‌వైజర్ ఉద్యోగాలకు అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ఆ వివరాలను తమకు తెలపాలని కోరారు.

నేటి నుంచి వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

వైవీయూ : కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 5 నుంచి 16వ తేదీ వరకు 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మార్గదర్శనంలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నియంత్రణ విభాగం తెలిపింది. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్స్ ఇన్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, యానిమేషన్ విభాగాలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

12న షిర్డీకి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్‌లోని ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డీకి ప్రత్యేక ఇంద్ర ఏసీ బస్సు నడపనున్నామని రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 12వ తేదీ 9942 నంబరుగల సర్వీసు సాయంత్రం 5 గంటలకు ప్రొద్దుటూరు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. రాను, పోను రూ. 4,500 ఛార్జీగా నిర్ణయించారన్నారు. తుల్జాపూర్, భవానీమాత ఆలయం, శని శింగనాపూర్ ఆలయాలు దర్శించుకోవచ్చన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు నుంచి కూడా ఈ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. రిజర్వేషన్ కోసం 99665 25210 నంబరులో సంప్రదించాలన్నారు.



పవర్ ఫుల్

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా 35 విద్యుత్ సబ్‌స్టేషన్లు
- 14 సబ్‌స్టేషన్లు మంజూరు, మరో 21 సబ్‌స్టేషన్లకు త్వరలో అనుమతి
- వీటిలో జగనన్న కాలనీలకు ప్రాధాన్యత
- పనులు చేపట్టేందుకు టెండర్లు

బి.కొత్తకోట : ప్రజలకు, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉన్నతాధికారులకు పంపిన కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతోంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా 35 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. దీనితో పల్లెలు, జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఇప్పటికే నిధులు మంజూరైన 14 విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు సిద్ధంగా ఉండగా మరో 21 కేంద్రాలకు సంబంధించి టెండర్ల నిర్వహణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీటి నిర్మాణ పనులు పూర్తయితే ఈ రెండు జిల్లాల్లో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న పల్లెలకు శాశ్వత పరిష్కారం లభించినట్లే.

నిరంతరాయంగా సరఫరా

కొత్తగా మంజూరై నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలతో వినియోగదారులకు సమస్య అన్నది ఉండబోదు. విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. సరఫరాలో అంతరాయం అనేది ఉండదు. లైన్ ఎక్కువ దూరంలో ఉండటం వల్ల సరఫరా నష్టాలు వస్తాయి. సబ్‌స్టేషన్ల సమీపం నుంచి సరఫరా లైన్లు ఉండటంవల్ల సరఫరా నష్టాలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, వైఫల్యం చెందడం తగ్గిపోతుంది. 24 గంటలు సరఫరా ఉంటుంది. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించబోయే సబ్‌స్టేషన్లతో కాలనీలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుంది. గృహ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సేవలు అందుతాయి. ఇప్పటికే కాలనీల్లో పూర్తయిన ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా మీటర్లను అమర్చుతోంది. కనెక్షన్ పొందాలంటే రూ.4,100 చెల్లించాలి. ఈ భారం లబ్ధిదారులపై పడకుండా ప్రభుత్వం భారం మోస్తోంది. కనెక్షన్‌తోపాటు సర్వీసు వైరు, ఎంసీబీలు, బాక్సులు ఇస్తున్నారు. కాలనీల్లో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా 24 గంటల సరఫరా ఇస్తున్నారు.

నిర్మాణానికి సిద్ధమైన సబ్‌స్టేషన్లు

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన కడప మామిళ్లపల్లె, నానాపల్లె, మైదుకూరు వైఎస్సార్ జగనన్నకాలనీ, కుడాలి, కమ్మవారిపల్లె, ప్రొద్దుటూరు మీనాపురం, పులివెందుల చిలేకాంపల్లి, ఊడవగండ్ల, లోపట్నూతల, రాంనూతనపల్లె, వలిమెల్ల, అన్నమయ్య జిల్లాలోని కోడూరు నియోజకవర్గం రెడ్డివారిపల్లె, బాలపల్లె, గొబ్బూరువారిపల్లెలకు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. రూ.35 కోట్ల వ్యయంతో నిర్మించే 33/11 విద్యుత్ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు దక్కడంతో పనులు చేపట్టనున్నారు.

టెండర్ల దశలో..

వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల జగనన్నకాలనీ, ప్రొద్దుటూరులోని రామేశ్వరం జగనన్నకాలనీ, బొల్లవరం జగనన్నకాలనీ, ఉక్కిసవాండ్లపల్లె, పైడిపాలెం, కమలాపురంలోని కొత్తగంగిరెడ్డిగారిపల్లె, గొందిపల్లెల్లో, అన్నమయ్య జిల్లాలోని సంబేపల్లె నారాయణరెడ్డిగారిపల్లె జగనన్నకాలనీ, గాలివీడులోని అరవీడు, చీమలచెరువు, తాడిగుంటపల్లెల్లో 33/11 విద్యుత్ కేంద్రాలను నిర్మించేందుకు రూ.26 కోట్లతో ప్రతిపాదించగా అనుమతులు లభించాయయి. వీటికి టెండర్ల నిర్వహణ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని డిస్కం ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాలోని పాత చిత్తూరు జిల్లా పరిధికి చెందిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో రామాపురం, పాతకోట, పులికల్లు, మద్దినాయునిపల్లె, బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీ, దిన్నిమీదపల్లెల్లో, మదనపల్లె నియోజకవర్గం దండువారిపల్లె, మట్లివారిపల్లె, పీలేరు నియోజకవర్గంలోని బాలయ్యగారిపల్లె, సరిమడుగులో సబ్ స్టేషన్ల కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు వ్యయం చేయనుంది.

అనుమతి రాగానే టెండర్లు



ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో పది కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి నివేదించాం. వీటి పనులు చేపట్టడం కోసం ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే టెండర్లను నిర్వహించి చర్యలు చేపడతాం.
– ఎం.కృష్ణారెడ్డి, డిస్కం ఎస్‌ఈ, తిరుపతి

వారం రోజుల్లో ఎత్తిపోతల పథకం

భూసేకరణ పూర్తి కావాలి

- శ్రీనివాస రిజర్వాయర్‌ను వర్షపు నీటితో నింపుదాం
- పింఛా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయండి
- జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ వరకు భూసేకరణ పూర్తి కావాలి
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో చేపడుతున్న ఎత్తిపోతల పథకం(లిఫ్ట్ స్కీం) భూసేకరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎత్తిపోతల పథకం, ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆగస్టు మాసంలో కురిసే వర్షాలకు శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో నీటితో నింపుదామని కలెక్టర్ అన్నారు. ఈలోగా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఝరికోన ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణలో భాగంగా శెట్టిపల్లి, దేవపట్ల గ్రామాల్లో భూసేకరణను గురువారంకల్లా గుర్తించాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు సంబంధించి వచ్చే వారం కల్లా ఫైనల్ ఆర్ అండ్ ఆర్ పూర్తి కావాలన్నారు. లక్కిరెడ్డిపల్లె లిఫ్ట్ స్కీంకు సంబంధించి ఫారం సీ, ఆర్ అండ్ ఆర్ వచ్చే గురువారానికి పూర్తి కావాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ముదివీడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి కురబలకోటలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరగా పూర్తిచేయాలన్నారు. జీఎస్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ వరకు భూసేకరణ విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వర్షానికి పింఛా ప్రాజెక్టులో నీటిని నిల్వ ఉంచేందుకు రిటర్నింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి ప్రాజెక్టు పనుల పురోగతిపై తెలియజేయాలన్నారు. అలాగే అన్నమయ్య డ్యాం గురించి సంబంధించిన ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికిరణ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల భూసేకరణ పరిహారం పంపిణీ చేయాలి

అన్నమయ్య జిల్లా పరిధిలో జాతీయ రహదారుల భూసేకరణ పరిహారం పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుంచి పీలేరు, ఎన్‌హెచ్ 716 కడప నుంచి రేణిగుంట మార్గంలో రాజంపేట డివిజన్ పరిధిలో ఇప్పటికే సేకరించిన భూములకు వేగంగా పరిహారం పంపిణీపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపు అంశంపై తహసీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రుణాల లక్ష్యం రూ. 3వేల కోట్లు

డీసీసీబీ సీఈఓ మనోహర్‌గౌడ్



పీలేరురూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా సహకార బ్యాంకు రుణాల లక్ష్యం రూ. 3వేల కోట్లుగా నిర్దేశించినట్లు డీసీసీబీ సీఈఓ ఇ. మనోహర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక డీసీసీ బ్యాంకులో ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ. వెయ్యి కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 38 డీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయని, కొత్తగా కేవీపల్లె, కలికిరి, పెద్దమండ్యం, గుర్రంకొండ, కలకడ మండలాల్లో డీసీసీ బ్యాంకులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డీసీసీబీ ఆధ్వర్యంలో పీలేరు, కలిచెర్లలో హెచ్‌పీ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 2500 స్వయం సహాయక సంఘాలకు రూ. 115 కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో 55 ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. డీసీసీబీ ఖాతాదారులు బ్యాంకు లావాదేవీలు జరిపేటప్పుడు పాత అకౌంట్ నంబరు స్థానంలో కొత్త అకౌంట్ నంబర్లు రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాగమణి, సూపర్‌వైజర్ మనోహర్, రాజేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ వెబ్‌సైట్‌లో పరీక్షల విభాగ సమాచారం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ రంగజనార్దన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం(వైవీయూ) కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ విభాగ వెబ్‌సైట్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన ప్రారంభించారు. గురువారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి, ఐటీ హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో విద్యార్థుల పరీక్షల షెడ్యూలు, టైంటేబుల్, సర్టిఫికెట్స్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, వైవీయూ పరీక్షల నియంత్రణ విభాగం అధికారులు డా. ఆదినారాయణ రెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

మాంగల్య బంధానికి మహా కానుక

- నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల
- జిల్లాలో 349 జంటలకు రూ. 2.76 కోట్ల నిధులు
- టీడీపీ హయాం కంటే భారీగా కానుక సాయం పెంపు



సాక్షి రాయచోటి : పెళ్లంటే నూరేళ్ల పంట.. మామిడాకులు, అరటి కొమ్మలు.. టెంకాయ పట్టలతో పెళ్లంటే పెద్ద సందడి. అయితే పెళ్లి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు అన్న సామెత ప్రకారం పెద్ద ఖర్చుతో కూడుకున్న తంతు. మాంగల్య బంధానికి జరిగే పెళ్లిలో ప్రభుత్వం కూడా తనవంతు సాయంగా కానుక అందించేందుకు సిద్ధమైంది. అయితే ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు చదువును ప్రోత్సహించడం, డ్రాపౌట్స్‌ను తగ్గించి అక్షరాస్యత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధనతో కొత్త జంటలకు శుభవార్త అందించింది. కొత్తగా పెళ్లి చేసుకుంటున్న జంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోంది. గతంలో టీడీపీ హయాంలో అంతంత మాత్రంగా అందిస్తుండగా, దాన్ని రెట్టింపు చేసి వైఎస్ జగన్ సర్కార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా వారికి ఆర్థిక భరోసా అందించనుంది.

ఆర్థికసాయం భారీగా పెంపు

రాష్ట్ర ప్రభుత్వం కల్యాణమస్తు, షాదీతోఫాల కింద అందించే ఆర్థికసాయాన్ని భారీ ఎత్తున పెంచి అందిస్తోంది. అందుకు సంబంధించి ఎస్సీ ఎస్టీలకు వివాహ కానుకగా రూ. లక్ష అందిస్తుండగా, కులాంతర వివాహం చేసుకుంటే రూ. 1.20 లక్షలు అందించనున్నారు. అలాగే బీసీ వర్గాల వివాహాలకు సంబంధించి రూ. 50 వేలు ఉండగా, వారు కులాంతర వివాహం చేసుకుంటే రూ. 75 వేలు అందించనున్నారు. మైనార్టీలకు సంబంధించి షాదీ తోఫా కింద రూ. లక్ష ఇవ్వనున్నారు. దివ్యాంగుల వివాహానికి ప్రభుత్వం కల్యాణమస్తు కింద రూ. 1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికులకు వివాహానికి కూడా రూ. 40 వేలు అందించాలని నిర్ణయించింది. గతంలో టీడీపీ హయాంలో చాలా తక్కువ మొత్తంలో పెళ్లి కానుక కింద అందించేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆలోచన చేసి రెట్టింపు మొత్తం అందేలా ప్రణాళిక రూపొందించింది.

పేద జంటలకు వరం

అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న నూతన జంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోంది. కల్యాణమస్తు, షాదీతోఫా కింద దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెద్ద మొత్తంలో ప్రభుత్వం సాయం చేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న నూతన జంటలకు సంబంధించిన మొత్తం శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రత్యేక కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు చెక్కు రూపంలో అందజేయనున్నాం.
– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

349 మందికి రూ. 2.76 కోట్లు

అన్నమయ్య జిల్లాలో కల్యాణ మస్తు, షాదీతోఫా పథకాలకు సంబంధించి సుమారు 349 జంటలు దరఖాస్తు చేసుకోగా అందరికీ పథకం వర్తించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ కార్మిక వర్గాలకు ఆర్థికసాయం అందించనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 349 మందికి రూ. 2.76 కోట్ల నిధులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు.

సమయం ఉంది మిత్రమా!

- ఇంటర్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉత్తీర్ణత శాతం పెంపే లక్ష్యం

ఉమ్మడి కడప జిల్లా సమాచారం

ప్రథమ సంవత్సరం	:18,839 మంది
ఫెయిలైనవారు	:10,236
ద్వితీయ సంవత్సరం	:17,056
ఫెయిలైనవారు	:6,826



మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ప్రత్యేక తరగతుల్లో బోధిస్తున్న అధ్యాపకులు

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెంపుపై ఇంటర్మీడియట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నిరాశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ముఖ్యంగా ప్రథమ సంవత్సరం చాలా మంది గట్టెక్కలేకపోయారు. ఈ నేపథ్యంలో ఇంటర్ తప్పిన విద్యార్థులకు జిల్లాలో ప్రత్యేక తరగుతులు నిర్వహిస్తున్నారు. ఈనెల 1 నుంచి 20 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుత్తీర్ణత నివారణ (రెమెడియల్) తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి మూడు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి ఉత్తీర్ణత శాతం పెంచడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని సబ్జెక్టుల వారీగా అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్ష తప్పిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను కళాశాలకు పంపాలని అధ్యాపకులు కోరుతున్నారు. 20 రోజుల పాటు అందించే శిక్షణ ద్వారా రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రయత్నం చేయనున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో మొదటి సంవత్సరం 18,839 మంది పరీక్షలు రాయగా ఇందులో 8603 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 17,056 మంది పరీక్షలు రాయగా 10,230 మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో వీరు గట్టెక్కాలంటే ప్రత్యేక మార్గదర్శనం అవసరమని ఇంటర్మీడియట్ బోర్డు భావించింది. అందుకే ఈ వేసవి సెలవుల్లో వారికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఒకటి నుంచి మూడు సబ్జెక్టులు తప్పిన విద్యార్థులు అనేక మంది ఉన్నారు. ప్రత్యేక తరగతుల తరువాత వీరిలో అత్యధికులను పరీక్ష పాస్ చేయించి ఉత్తీర్ణత శాతం పెంచాలన్న దిశగా విద్యాశాఖాధికారులు అడుగులు వేస్తున్నారు.

ఆందోళన వద్దు

పరీక్ష తప్పామని, మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థులు ఆందోళన చెందవద్దని ఇంటర్ కళాశాలల అధ్యాపకులు సూచిస్తున్నారు. ఇటీవల మదనపల్లెకు చెందిన ఓ విద్యార్థి పరీక్షల్లో తప్పానని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ పరీక్షలు చాలా సులభంగా ఉంటాయని, మార్కులు తక్కువ వచ్చిన వారు సప్లిమెంటరీ రాయవచ్చని అధ్యాపకులు చెబుతున్నారు. ఇప్పుడు ఫెయిలయిన వారు ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందితే పరీక్ష గట్టెక్కడం సులభమేనని అంటున్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 7 వరకు జరగనున్నాయి.

సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు



ఫెయిలైనవారు, సప్లిమెంటరీ పరీక్ష రాసేవారు ప్రత్యేక తరగతులకు రావచ్చు. దగ్గరలోని కళాశాలకు వెళ్లి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అధ్యాపకులు అందుబాటులో ఉంటారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివి ఒకటి నుంచి మూడు సబ్జెక్టులు తప్పిన విద్యార్థులను పాస్ చేయించేలా ప్రత్యేక తరగతుల్లో దృష్టి సారిస్తున్నాము. మిగిలిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా సందేహాలు నివృత్తి చేసి ఉత్తీర్ణత శాతం మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం.
– బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

చంద్రబాబు పాలనలో

పబ్లిసిటీ తప్ప అభివృద్ధి లేదు

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : చంద్రబాబు పాలనలో పబ్లిసిటీకి ఇచ్చిన ప్రాధాన్యత అభివృద్ధికి ఇవ్వలేదని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని తమదని చెప్పుకుంటూ సెల్ఫీలు, వ్యక్తిగత విమర్శలతో రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబు తొలుత ఎన్నికల మేనిఫెస్టోలపై సెల్ఫీల సవాల్‌కు సిద్ధమా అని ప్రశ్నించారు. 2014లో అమలు చేస్తామన్న టీడీపీ మేనిఫెస్టోను అధికారంలోకి రాగానే కనిపించకుండా చేసిన ఘనత మీదైతే, జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 95శాతం మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత మాది అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంటే సహించలేని బాబు అసత్య ప్రచారం చేయడం దారుణమన్నారు. రాజధాని ఏది అని ప్రశ్నిస్తున్న బాబుకు వైజాగ్ అని చెప్పడానికి సిగ్గు ఎందుకని ఎమ్మెల్యే నిలదీశారు. గత మూడేళ్లుగా చిన్న ఆఫీసును కూడా వైజాగ్‌లో పెట్టనీయకుండా కోర్టుల ద్వారా స్టేలు తెచ్చి అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఎవరనేది రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి చేసిన అభివృద్ధి ఇది అని చెప్పలేని దుస్థితిలో బాబు ఉండడం సిగ్గుచేటన్నారు. కులాలు, మతాలను రెచ్చగొడుతూ ప్రాంతీయ విభేదాలను సృష్టించేలా విమర్శలు చేస్తూ పాదయాత్రను కొనసాగిస్తున్నారని లోకేశ్‌పై విమర్శలు గుప్పించారు. చంద్రబాబుకు ఏమాత్రం ప్రజాస్వామ్య విలువలు ఉన్నా 2014లో మీరు ప్రకటించిన మేనిఫెస్టోతో ముందుకు రావాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో ధైర్యంగా ప్రజల వద్దకు వెళుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ప్రతి గడపను తాకేలా గొప్ప సదవకాశాన్ని తమ నాయకుడు కల్పించారన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని దేశంలో ఏ పార్టీ చేయలేదన్నారు. అన్నింటా వెనుకబడ్డ రాయచోటి ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా మార్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నా కొంతమంది వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకొని చేస్తున్న ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

నాలుగు బైకులు స్వాధీనం

రాజంపేట : పట్టణంలో వివిధ వ్యక్తులకు సంబంధించిన నాలుగుబైకులను పట్టుకున్నామని సీఐ ఎస్వీ నరసింహారావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డిలు గురువారం వెల్లడించారు. బాధితులు గండికోట కృష్ణమూర్తి, షేక్ ఉమ్మరి, చింతల నరేంద్ర బాబు, వలిమి శివరామయ్యలు తమ బైకులు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. చోరీలపై దర్యాప్తు నిర్వహించిన పోలీసులు పట్టణంలోని కొలిమివీధికి చెందిన లవిడి చంద్రశేఖర్‌రాజును అరెస్టు చేసి అతడు చోరి చేసిన బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పట్టణ పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. వెంగంవారిపల్లె పంచాయతీ సింగారయ్యగారిపల్లెకు చెందిన వెంకటరమణ సారాను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించామన్నారు. గ్రామసమీపంలో నాటుసారాను విక్రయిస్తున్న వెంకటరమణను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 8లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదుచేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

మదనపల్లె సిటీ : పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టు టౌన్ సీ.ఐ మురళీకృష్ణ తెలిపారు. మదనపలె పట్టణంలోని చీకలిగుట్టలో గురువారం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో పట్టుబడిన ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్.ఐ లోకేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవరం డైరెక్టర్‌గా రవీంద్ర

బిషప్.వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం



ఆరోగ్యవరం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రవీంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బిషప్.రెవ.డాక్టర్.ఐజాక్ వరప్రసాద్



ఆరోగ్యవరం నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా జోయల్ స్వరూప్ కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న బిషప్.ఐజాక్‌వరప్రసాద్

మదనపల్లె : క్షయరోగుల వైద్యసేవలకు దేశ వ్యాప్తంగా పేరుమోసిన వైద్యకేంద్రం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ (శానిటోరియం–ఏఎంసీ) నూతన డైరెక్టర్‌గా డాక్టర్.కే.పి.రవీంద్ర బాధ్యతలు స్వీకరించారు. రాయలసీమ డయాసిస్ బిషప్.రెవ.డాక్టర్.పి.ఐజాక్ వరప్రసాద్, పాస్టర్ల సమక్షంలో గురువారం ఆరోగ్యవరంలోని ఏఎంసీ డైరెక్టర్ కార్యాలయం ఎదుట భారీ బందోబస్తు మధ్య కే.పి.రవీంద్ర డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్.పి.ఐజాక్ వరప్రసాద్ మాట్లాడుతూ... రాయలసీమ డయాసిస్ రాజ్యాంగం, చట్టం ప్రకారం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఒక వ్యక్తికి, కుటుంబానికి సంబంధించినది కాదని, సీఎస్ఐకు చెందిన దైవిక, ధార్మికసంస్థగా పేర్కొన్నారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆరోగ్యవరంలో వైద్యపరిచర్యల్లో భాగంగా ఎందరికో సాంత్వన చేకూర్చడం, వైద్యసేవలను అందజేస్తున్నామన్నారు. పేదలకు అందుబాటులోకి వైద్యాన్ని తీసుకువచ్చేందుకు క్రైస్తవ మిషనరీలు వైద్యశాలలను స్థాపించాయన్నారు. రాయలసీమ డయాసిస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల్లో ఆరోగ్యవరం(యూఎంటీఎస్) దేవుడి వరప్రసాదంగా దశాబ్దాలుగా సేవలందించిన విశిష్ట వైద్య సంస్థగా తెలిపారు. ఏఎంసీ కొందరి సొంత సామ్రాజ్యంగా, వ్యాపారసంస్థగా మారిన తరుణంలో రాయలసీమ డయాసిస్ అధికార మండలి చట్టాన్ని అనుసరించి సంస్థను కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. అందులోభాగంగా 33 ఏళ్లుగా ఏఎంసీకి డైరెక్టర్‌గా సేవలందించిన డాక్టర్.బి.వెస్లీ స్థానంలో జమ్మలమడుగు సీఎస్ఐ క్యాంప్‌బెల్ ఆస్పత్రిలో కంటివైద్యులుగా వేలాది శస్త్రచికిత్సలు చేసి అపార అనుభవం కలిగిన డాక్టర్.కే.పి.రవీంద్రను నియమించామన్నారు. మాజీ డైరెక్టర్ డాక్టర్.బి.వెస్లీ నూతన డైరెక్టర్ నియామకాన్ని అడ్డుకునేందుకు, అక్రమంగా తన పదవిని కొనసాగించుకునేందుకు న్యాయస్థానంలో కేసులు వేస్తే చిత్తూరు డిస్ట్రిక్ట్‌కోర్టు ఆయన పిటిషన్‌ను డిస్మిస్ చేసిందన్నారు. నూతన డైరెక్టర్ కే.పి.రవీంద్ర మాట్లాడుతూ. ఏఎంసీకి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం దేవుడి ఆదేశంగా భావిస్తున్నానన్నారు. ఆరోగ్యవరం ప్రతిష్టను పెంచేలా పనిచేస్తామన్నారు. అనంతరం కత్రినా మోల్లర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఆరోగ్యవరం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్‌గా కే.ఆర్.జోయల్ స్వరూప్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. 33 ఏళ్లుగా ఏఎంసీ డైరెక్టర్‌గా వ్యవహరించిన డాక్టర్.బి.వెస్లీ నూతన డైరెక్టర్ నియామకాన్ని అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి డైరెక్టర్ కార్యాలయానికి, అడ్మినిస్ట్రేషన్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గదులకు తాళాలు వేసుకున్నప్పటికీ వాటిని పగులగొట్టి బాధ్యతల స్వీకరణ తంతును ముగించారు. నూతన డైరెక్టర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా మాజీ డైరెక్టర్ బి.వెస్లీ వర్గం వ్యక్తులు ఘర్షణకు దిగవచ్చన్న ముందస్తు సమాచారంతో డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సీఐలు సత్యనారాయణ, మురళీకృష్ణ, శివాంజనేయులు పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఏఎంసీ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలుచేసి ప్రశాంత వాతావరణంలో నూతన డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ జరిగేలా చూశారు. కార్యక్రమంలో రెవ.డాక్టర్.బి.సునీల్‌వరకుమార్, జే.ఈ.భక్తవత్సలం, మేరీ కుమార్, షిరీన్‌లారెన్స్, డాక్టర్.ఎం.ఎ.నెల్సన్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : ఓ లారీ డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డారు. ములకలచెరువు మండలం పర్తికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి (38) లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం కుటుంబ సమస్యలతో భార్య ధనలక్ష్మితో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్నయత్నంకు పాల్పడ్డాడు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ విరాళం



ఎంపీ విరాళాన్ని అందజేస్తున్న సర్పంచ్ రాజేష్

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మూలస్థానమ్మ, శ్రీ అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.2 లక్షలు విరాళం అందించారు. గురువారం సర్పంచ్ రాజేష్ ఆలయ నిర్వాహకులు పల్లపు రత్నయ్య, సి. రవీంద్రలకు విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందించడం పట్ల గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి. చెంగల్‌రాయుడు, సి. హరి, వై.శేఖర్, బి. శ్రీనివాసులు, బి.చలపతి, చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూదిమందు వికటించి వృద్ధురాలి మృతి



మృతి చెందిన గంగులమ్మ

మదనపల్లె సిటీ : సూదిమందు వికటించి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. సత్యసాయి జిల్లా ఎన్‌పి కుంట మండలం తిమ్మమ్మమర్రిమాను గ్రామానికి చెందిన గంగులమ్మ(72) కూలిపనులు చేస్తుండేది. ఈ నేపథ్యంలో ఆమె కొద్దిరోజులుగా దృష్టి లోపంతో బాధపడుతోంది. మదనపల్లె మండలం బెంగుళూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రి వైద్యులు ఇటీవల పరీక్షించి ఆపరేషన్ చేసుకోవాలని సూచించారు. అయితే గురువారం ఉచితంగా ఆపరేషన్ చేస్తుండటంతో బాధితురాలు ఆస్పత్రికి వచ్చింది. ఇందులో భాగంగా తొలుత అన్ని టెస్టులు నిర్వహించి ఆపరేషన్‌కు సిద్ధం చేశారు. ఆ తరువాత మత్తుసూదిమందు ఇచ్చారు. కొద్దిసేపటి తరువాత గంగులమ్మ ఉన్నట్టుండి ఆస్పతిలో కుప్పకూలిపోయింది. గమనించిన స్థానికులు బాధితురాలిని అంబులెన్స్‌వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి దారిలో మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. మత్తుమందు ఇచ్చిన తరువాత బీపీ, పల్స్‌రేట్ డౌన్ కావడంతో బాధితురాలు కోమాలోకి వెళ్లిపోయి మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. మత్తుమందు అధిక మోతాదు ఇవ్వడంతో బాధితురాలి శరీరం సహకరించలేదని, దీంతో ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లు వివరించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది మృతదేహాన్ని తీసుకెళ్లి మార్చురీలో ఉంచారు. ఘటనపై గుంగులమ్మ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. సూదిమందు వికటించడంతోనే మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు తాలూకా పోలీసులు చెప్పారు.

జాతీయస్థాయి పోటీల్లో జిల్లా ఆణిముత్యం మెరుపులు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న బొమ్ము అంకిత

కడప స్పోర్ట్స్ : జాతీయస్థాయి జూనియర్ హాకీ నేషనల్స్‌లో కడప క్రీడాకారిణి సత్తాచాటుతోంది. ఈనెల 4 నుంచి 14వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో నిర్వహిస్తున్న 13వ హాకీ ఇండియా సబ్‌జూనియర్ ఉమన్ నేషనల్ చాంపియన్‌షిప్–2023లో ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిథ్యం వహించిన బొమ్ము అంకిత ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును కైవసం చేసుకుంది. గురువారం పంజాబ్‌తో నిర్వహించిన మ్యాచ్‌లో ఈమె గోల్స్ చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించడంతో ఈమెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును నిర్వాహకులు అందజేశారు.

చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన బొమ్ము లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి దంపతుల కుమార్తె అయిన ఈమె 4వ తరగతి నుంచి కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శిక్షణ పొందింది. ప్రస్తుతం బెంగుళూరు సాయ్ హాకీ అకాడమీలో శిక్షణ పొందుతూ జాతీయస్థాయిలో రాణిస్తోంది. జిల్లా క్రీడాకారిణి ప్రతిభ పట్ల పలువురు క్రీడాకారులు, హాకీ సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ములకలచెరువు : అదుపుతప్పి ప్రయాణికుల ఆటో బోల్తా కొట్టడంతో ఆటో డ్రైవర్‌తో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం పట్టేంవాండ్లపల్లెకు చెందిన రమణ తన ఆటోలో పీటీయం నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని ములకలచెరువుకు బయల్దేరాడు. ములకలచెరువు సమీపంలోకి రాగానే అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టింది. ఆటోలోని ఐదుగురికి స్వల్పగాయాలు కాగా, డ్రైవర్ రమణ(32)కి తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వెళ్లే ప్రయాణికులు గమనించి డ్రైవర్‌ను 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

తాగునీరు అందించాలంటూ నిరసన

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీలో ఉద్యోగులకు, కార్మికులకు తాగునీరు అందించాలని ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వలే ఉద్యోగులకు తాగునీరు అందించాలని, ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

సుండుపల్లె (రాయచోటిటౌన్) : సుండుపల్లె పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అకస్మిక తనిఖీ చేశారు. ఆయన పలు రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అన్నమయ్య జిల్లాలోకి మద్యం అక్రమంగా తరలించకుండా ఇప్పటికే 11 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. కర్నాటక రాష్ట్రంలో జరగుతున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా స్థానికంగా ఎవరైనా కర్నాటక రాష్ట్ర ప్రజలను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

యువతిపై లైంగిక దాడి

ఒంటిమిట్ట : మండల శివారు గ్రామంలో గురువారం 17 సంవత్సరాల యువతిపై లైంగిక దాడి చోటు చేసుకుందని స్థానిక పోలీసులు తెలిపారు. కోటికవారిపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మయ్య(20) అనే యువకుడు బోయపల్లి గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో మేకలు మేపుకుంటున్న ఓ 17 సంవత్సరాల యువతిని వెంట పడి లైంగిక దాడికి పాల్పడ్డాడని.. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

కడప, నెల్లూరు జట్లు విజయం



తలపడుతున్న కడప, కర్నూలు జట్లు



110 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ జహీర్‌అబ్బాస్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్ర 51, సాయిసూర్యతేజ 48 పరుగులు చేశారు. కడప బౌలర్ విజయ భవేంద్ర 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. జట్టులోని జహీర్ అబ్బాస్ 110 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

అనంతపై నెల్లూరు విజయం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 27.3 ఓవర్లలో 125 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని చరిష్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సాకేత్‌రామ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 52 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

క్షయ నిర్మూలనకు అందరూ కలిసి పనిచేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ డేనియల్ ప్రాంక్లిన్

మదనపల్లె సిటీ: క్షయ నిర్మూలనకు అందరూ కలిసి పని చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) జిల్లా కన్సలెంట్ డాక్టర్ డేనియల్ ప్రాంక్లిన్ పేర్కొన్నారు.గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని టీబీ సెంటర్,మదనపల్లె మండలంలోని సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు నేషనల్ టీబీ ఎలిమినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయరహిత పంచాయతీల స్థాపనకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా క్షయ అనుమానితులను గుర్తించి సమీపంలోని టీబీ కేంద్రానికి తీసుకొచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్, దయాలన్, సుశీల, వనజ, జ్ఞానతిలకం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంగమాంబ జయంతి ఉత్సవాలు

నృసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో వెంగమాంబ



శ్రీలక్ష్మీనరసింహస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయాన్ని సందర్శించిన ధర్మాచార్య ఆశ్రమ పీఠాధిపతి సాధుబద్రీశుదాసు స్వామి

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 253వ జయంతి, నృసింహస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రియ భక్తురాలైన ప్రముఖ రచయిత్రి వెంగమాంబ జన్మస్థలం తరిగొండ గ్రామం. ఇక్కడే శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ప్రాంగణంలోనే వెంగమాంబ ఆలయం ఉంది. వెంగమాంబ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఉదయం 9 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కావించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహస్నపనం నిర్వహించారు. 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వెంగమాంబ ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి పలు రకాల నైవేద్యాలను సమర్పించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండులో వెంగమాంబ విగ్రహానికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో గ్రామ వీధుల మీదుగా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల చేత మాతృశ్రీ వెంగమాంబ సంకీర్తన గోష్ఠిగానం, హరికథా కాలక్షేప కార్యక్రమాలు నిర్వహించారు. వెంగమాంబ, నృసింహ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వెంగమాంబ ఆలయాన్ని దర్శించడం మహా భాగ్యం

మాతృశ్రీ తరిగొండకు వెంగమాంబ ఆలయాన్ని ఆమె జయంతి రోజునే దర్శించడం మహా భాగ్యమని ఢిల్లీ శ్రీ జగద్గురు ధర్మాచార్య ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సాధుబద్రీశదాసు అన్నారు. మాతృశ్రీ వెంగమాంబ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని శ్రీ తరిగొండ వెంగమాంబ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంగమాంబకు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. స్వామివారి స్నపన తిరుమంజనంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామిపై వెంగమాంబకున్న అపార భక్తి విశ్వాసాలు శ్లాఘనీయమన్నారు. అంతటి మహాభక్తురాలు పుట్టిన ఈ ప్రాంతాన్ని సందర్శించుకోవడం మహాదానందంగా ఉందన్నారు. స్వామి అనుగ్రహం పొందిన ఆమె జీవతం ఎందరికో ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డెప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టీటీడీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణస్వామి, అనిల్, కృష్ణరాజ, గోకుల్‌స్వాములు, టీటీడీ వెంగమాంబ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.